సాక్షి కర్నూలు

మంగళవారం ı 23 ı జనవరి ı 2024



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. మండపంలో వెయ్యి దీపాలను అర్చకులు వెలిగించారు.



..అక్రమ వసూళ్లు

కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల వద్ద ఉన్న అంతర్‌రాష్ట్ర ఆర్‌టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తేల్చారు. 10లో▸



‘సెబ్’లో భారీగా బదిలీలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో భారీగా బదిలీలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు సీఐ, ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. 10లో▸

న్యూస్‌రీల్

నెలాఖరులోగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఏపీఎంఎస్‌ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్మాణంలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలించారు. అందులోని సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, పాలియేటివ్ కేర్ విభాగాలను పరిశీలించారు. ఈ విభాగానికి త్వరలో అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ, బర్న్స్ విభాగాలతో పాటు కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్మిస్తున్న ఎగ్జామినేషన్ హాలు విభాగాలను సందర్శించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, క్యాన్సర్ విభాగం హెచ్‌వోడి డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖలో ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి సోమవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 252 ఏహెచ్‌ఏ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా.. 233 పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఎస్టీ ఉమెన్, ఎక్స్ సర్వీస్‌మెన్, అంధులకు రిజర్వు చేసిన 19 పోస్టులకు అభ్యర్థులు లభించలేదు. మొదటి రోజున 117 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. 100 శాతం అభ్యర్థులు హాజరు కావడం విశేషం. డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్‌లు డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, పి.వెంకటరమణ, పివి.రమణమూర్తి, డీవీ రమణయ్య నేతృత్వంలోని టీమ్‌లు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. మంగళవారం 116 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

మంత్రాలయంలో శ్రీరామ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరించి వస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: ప్రముఖ అధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో 56 అడుగుల ఏకశిలా అభయ రామ విగ్రహాన్ని సోమవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన అభయ శ్రీరామ ఫౌండేషన్ సౌజన్యంతో పీఠంతో కూడిన ఈ విగ్రహాన్ని రూ.8కోట్ల అంచనా వ్యయంతో రూపొందించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట శుభదినాన ఇక్కడ కూడా విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం ఏఏఓ మాధవ శెట్టి, మఠం మేనేజర్లు శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, నరసింహమూర్తి, ద్వారపాలక అనంత స్వామి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అతివలే నిర్ణేతలు!

- తుది ఓటరు జాబితా విడుదల
- జిల్లాలోని ఓటర్ల సంఖ్య 20,14,794
- పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువ
- ఫారం-6,7,8లపై పారదర్శకంగా విచారణ
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు



కర్నూలు(సెంట్రల్): రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్లు నిర్ణేతలుగా మారనున్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా.. ఆరింటిలో తరుణీమణుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. కర్నూలు, పాణ్యం, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో వీరి తీర్పు కీలకం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం తుది ఓటరు జాబితాను ప్రకటించారు. మొత్తం ఓటర్లు 20,14,797 మంది ఉండగా.. ఇందులో మహిళలు 10,19,597, పురుషులు 9,94,885, ఇతరులు 312 మంది ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళలు 24,712 మంది ఎక్కువగా ఉన్నారు. తుది ఓటరు జాబితాను కలెక్టరేట్, ఆర్‌డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతోపాటు గుర్తించిన 2,186 పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు.

ఏడాది కాలంలో 74,166 మంది ఓటర్ల పెరుగుదల

2024లో జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ముందుగానే ఓటరు జాబితా రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. 2023 జూలై 21 నుంచి 2024 జనవరి 22వ తేదీ వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)-2024 కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించి, ఫారం-6, 7, 8లను స్వీకరించారు. ఎస్ఎస్ఆర్-2023 ప్రకారం జిల్లాలో 19,40,628 మంది ఓటర్లు ఉండగా.. 2024 ముసాయిదా జాబితా ప్రకారం వీరి సంఖ్య 19,71,325కు పెరిగింది. తుది ఓటరు జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 20,14,794గా నమోదైంది. ఈ ప్రకారం సంవత్సరం కాలంలో 74,166 మంది ఓటర్లు కొత్తగా పెరిగారు.

111 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు

జిల్లాకు చెంది ఇతర దేశాల్లో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన వారు కూడా స్థానికంగా ఓటు హక్కును నమోదు చేశారు. కర్నూలులో 5, పాణ్యంలో 23, పత్తికొండలో 5, కోడుమూరులో 10, ఎమ్మిగనూరులో 4, మంత్రాలయంలో 1, ఆదోనిలో 9... మొత్తంగా జిల్లాలో 111 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు నమోదయ్యారు. అదే సమయంలో సర్వీసు ఓటర్లు 1,602, పీడబ్ల్యూడీ ఓటర్లు 22,863 మంది, 80 ఏళ్లకు పైబడిన ఓటర్ల సంఖ్య 24,478గా ఉంది.

18–19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్ల సంఖ్య 30,799

కర్నూలు జిల్లాలో 18–19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్ల సంఖ్య30,799. ఇందులో పాణ్యంలో అత్యధికంగా 5,369 మంది, కర్నూలులో అత్యల్పంగా 2,111 మంది ఓటర్లు ఉన్నారు. 2023 జనవరి 5వ తేదీ వరకు 18–19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు సంఖ్య 13,474. ఈ ఏడాదిలో 44,273 మంది కొత్తగా ఓటు హక్కును పొందారు.

భారీగా మార్పులు, చేర్పులు

స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా అధికారులు ఇంటింటా నిర్వహించిన సర్వే ప్రకారం జాబితాలో భారీ మార్పులు, చేర్పులు జరిగాయి. కొత్తగా ఓటరుగా 31,478 మంది నమోదయ్యారు. 10567 ఓటర్లను డూప్లికేట్‌గా గుర్తించి తొలగించారు. 59,750 మందిని చనిపోయినట్లు గుర్తించి జాబితా నుంచి వారిని తొలగించారు. అలాగే ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా వలస వెళ్లిన 24,682 మందిని గుర్తించి తొలగించారు. చిరునామాలు, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకున్న వారిలో 27,599 మంది ఓటర్లు ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలు...

బీఎల్ఓలు ఇంటింటా తిరిగి ఓటరుజాబితాలో నమోదు, జాబితానుంచి తొలగించడం, ఓటర్ల వివరాల సవరణ కోసం ఫారం-6, 7, 8లను స్వీకరించారు. ఇందులో ఫారం - 6 కింద 24,503 అర్జీలను స్వీకరించగా 15,212 అర్జీలను పరిష్కరించారు. ఇంకా 9,291 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫారం-7 కింద 13,723 అర్జీలను స్వీకరించగా అందులో 9,938 అర్జీలు పరిష్కారం కాగా, 3785 పెండింగ్‌లో ఉన్నాయి. ఫారం-8 కింద 9,829 అర్జీలను స్వీకరించాగా అందులో 6,439 అర్జీలకు పరిష్కారంచూపగా...3,390 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

కర్నూలు జిల్లా ప్రథమం

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సోమవారం తుది ఓటరు జాబితా విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4,08,07,256 ఉండగా.. కర్నూలు జిల్లా అత్యధిక ఓటర్లతో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 20,14,794 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తంఓటర్లు
కర్నూలు	1,31,150	1,39,760	32	2,70,942
పాణ్యం	1,57,113	1,65,306	75	3,22,494
పత్తికొండ	1,09,673	1,09,943	23	2,19,639
కోడుమూరు	1,21,050	1,20,703	14	2,41,767
ఎమ్మిగనూరు	1,19,769	1,23,253	45	2,43,067
మంత్రాలయం	1,00,732	1,04,677	20	2,05,429
ఆదోని	1,27,798	1,29,682	49	2,57,529
ఆలూరు	1,27,600	1,26,273	54	2,53,927
మొత్తం	9,94,885	10,19,597	312	20,14,794

అనుమానపు ఓటర్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన

ఓటరు జాబితా సవరణపై వివిధ పార్టీల నుంచి అనేక ఫిర్యాదులు ఎన్నికల కమిషన్‌కు అందుతూనే ఉన్నాయి. ఒకే ఇంట్లో పది, అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉండడం, ఇంటి నంబర్లు, ఇతర వివరాలు లేకుండా ఉన్న ఓటర్లపై నిశిత పరిశీలన చేసి తొలగించాలని కమిషన్‌కు అన్ని పక్షాల నుంచి డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం జిల్లాలో 47,687 ఇళ్లలో పది, అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వివరాలను గుర్తించి ఆయా కుటుంబాలను విభజించి డూప్లికేట్ ఓటర్లు అయితే తొలగించడం, నిజంగా అర్హులై ఉంటే ఓటుకు హక్కును కల్పించారు. ఇంటి నంబర్లు లేకుండా ఉండడం, అనుసంధానం కాని ఓటర్ల సఖ్య జిల్లాలో 96 ఉండగా అన్నింటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించారు.

అర్హులుంటే ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చు



తుది జాబితా విడుదలైనప్పటికీ ఓటు హక్కుకోసం ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలి. తుది జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి సరైన ఫారం ద్వారా తీసుకురావచ్చు. ఎస్ఎస్ఆర్-2024ను అత్యంత పారదర్శకంగా రూపొందించాం. ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్నాం. రాజకీయ పార్టీలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించాం.

–డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

శ్రీరామం.. భక్తిపారవశ్యం

శ్రీరామ నామం మార్మోగింది. సోమవారం రాత్రి కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సీతారాముల కల్యాణోత్సవం, పట్టాభిషేక మహోత్సవం కనులపండువగా సాగింది. భారీగా తరలివచ్చిన భక్తులు ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించి తన్మయత్వం పొందారు. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు





కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సోమవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు



శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీరాముని విగ్రహం

మహిళలకు ఆర్థిక ‘ఆసరా’

- మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- నేడు 4వ ఏడాది వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదల
- 25,705 సంఘాలకు రూ.142.36 కోట్ల లబ్ధి
- నాలుగేళ్లలో 2,49,976 మంది మహిళలకు ప్రయోజనం

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నెరవేర్చారు. ఇందుకోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారు. జిల్లాలో నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా 25,705 సంఘాలకు రూ.568.28 కోట్ల మేర లబ్ధి చేకూరింది. మొత్తం 2,49,976 మంది మహిళలకు ప్రయోజనం లభించింది. నాలుగో ఏడాది ఆసరా నిధులను మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీ తదితరులు హాజరుకానున్నారు. నాలుగో ఏడాదిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 17,334 స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలకు రూ.90.87 కోట్లు , అర్బన్ ప్రాంతాలకు చెందిన 8,371 సంఘాలకు రూ.51.49 కోట్లు విడుదల కానున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 25,705 సంఘాలకు రూ.142.36 కోట్లు విడుదల కానున్నాయి.



జీవనోపాధులపై చర్చిస్తున్న పొదుపు మహిళలు (ఫైల్)

వైఎస్సార్ ఆసరా సంబరాలు

ఈ నెల 24 నుంచి 31 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆసరా సంబరాలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ-వైకేపీ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మొత్తం ఎనిమిది రోజుల పాటు ఈ సంబరాలు నిర్వహిస్తారు. సంబంధిత ఎమ్మెల్యేలు ఇప్పటికే ఆసరా సంబరాల్లో పాల్గొనేందుకు తేదీలు కూడా ఇచ్చారు. అన్ని మండలాల్లో ఆసరా సంబరాలు జరుగుతాయి. మండలాల వారీగా నిర్వహించే సంబరాలకు అనుగుణంగానే ఆసరా నిధులు విడుదలవుతాయి.

జీవనోపాధుల వృద్ధి

ప్రభుత్వ తోడ్పాటుతో జిల్లాలో 71,029 మంది మహిళలు జీవనోపాధులను వృద్ధి చేసుకున్నారు. కొందరు సూక్ష్మ, చిన్న తరహా పారిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని చోట్ల సొంత పెట్టుబడితో చేయూత మహిళా మార్ట్‌లు నడుపుతున్నారు. రొట్టెల తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఆలూరు, ఆస్పరి ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు జీన్స్ పాయింట్ల తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. జ్యూట్‌బ్యాగ్‌లు, ఊదిబత్తీల తయారీలో రాణిస్తున్నారు. స్వీట్లు వివిధ తినుబండరాలు తయారు చేసి షాపులకు సరఫరా చేస్తున్నారు. పొట్టేళ్ల, పెరటికోళ్ల పెంపకంలో రాణిస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు కే.శాంతమ్మ. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామానికి చెందిన ఈమె గణపతి ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలు. వైఎస్సార్ ఆసరా కింద ఏటా రూ.9,131 ప్రకారం నాలుగేళ్లలో రూ.36,524 లభించాయి. దీనికి తోడు బ్యాంకు లింకేజీ, వైఎస్సార్ చేయూత తదితర వాటి కింద లభించిన నిధులతో కిరాణా వ్యాపారంతో పాటు లేడీస్ కార్నర్ ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి భూమి లేకపోయినప్పటికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధిలో రాణిస్తున్నారు. కుమార్తె వివాహం కూడా చేశారు. అన్ని ఖర్చులు పోగా నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తోందని ఈమె చెబుతున్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మహిళాసంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను మరింత అభివృద్ధి చేసుకున్నారు. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో జిల్లాలో 77 వేలకుపైగా మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. – సలీమ్‌బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు చర్య లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు.సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరె న్స్ హాలులో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల ప్రగతి ప్రతిబింబించేలా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రశంసాపత్రాలకు సంబంధించి జాబితాలను త్వరగా డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు అందజేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువ మంది విద్యార్థు లుపాల్గొనేలా చూడాలని డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ మౌర్య పాల్గొన్నారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

జగనన్నకు చెబుదాం–స్పందనలో వచ్చిన అర్జీలకు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

ఉద్యోగుల వివరాలు నమోదు చేయండి

రానున్న సాధారణ ఎన్నికల్లో పాల్గొనే అధికారుల వివరాలను నిర్దీత ఫార్మెట్‌లో ప్రతి డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఇందుకోసం ఇప్పటికే ఎన్నికల నిర్వహణ మ్యాన్ పవర్ కమిటీ జిల్లా ఖజానా శాఖ అధికారి నేతృత్వంలో పనిచేస్తోందన్నారు. ఉద్యోగుల వివరాలను నూటికీ నూరు శాతం తెప్పించి వారం రోజుల్లో తనకు అందజేసే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రెగ్యులర్ ఉద్యోగులు 26 వేలమంది ఉన్నారని, ఇప్పటి వరకు 18 వేల మంది ఉద్యోగుల వివరాలను మాత్రమే నమోదుచేశారని, మిగిలిన 8 వేల మంది ఉద్యోగుల డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కెనరా బ్యాంకు టర్నోవర్ రూ.22 లక్షల కోట్లపైనే



మాట్లాడుతున్న రవికుమార్

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు టర్నోవర్ రూ.22 లక్షల కోట్లు దాటిందని ఆ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ రవి కుమార్ తెలిపారు. టర్నోవర్‌లో జాతీయ స్థాయిలో కర్నూలు రీజియన్ 4వ స్థానంలో నిలువడం అభినందనీయమని పేర్కొన్నారు. సోమవారం మొదటిసారిగా కర్నూలుకు వచ్చిన ఆయనకు కర్నూలు రీజియన్ సెక్రటరీ పుష్పకుమార్, ఇతర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కెనరా బ్యాంకు రీజినల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజియన్‌లోని అధికారులతో ముఖాముఖీ మాట్లాడారు. బ్యాంకు ప్రగతిని సమీక్షించడంతో పాటు సమస్యలు తెలుసుకున్నారు. రీజియన్ సెక్రటరీ పుష్పకుమార్ వివిధ అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కెనరా బ్యాంకులో అన్ని వర్గాల వారికి అనుగుణంగా రుణ పథకాలు ఉన్నాయన్నారు. బ్యాంకు ప్రగతిని మరింత మెరుగుపరిచేందుకు మరింత చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సీబీవోఏ నాయకులు రమాప్రసాద్, రాఘవన్, సత్యప్రకాశ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.









ఆదోని: రథంలో సీతారామ, లక్ష్మణుల ఉత్సవమూర్తులు, కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, మహానంది: రాముల వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, గడివేముల: వాల్మీకి దేవాలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం



ఆదోని: భారీ భక్తజన సందోహం మధ్య శోభాయాత్ర

ఊరూవాడా 'అయోధ్య' వేడుక

అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుక నేపథ్యంలో సోమవారం పట్టణాలు, పల్లెల్లో పండుగ వాతావరణం కనిపించింది. రామాలయాలను ప్రత్యేకంగా అలంకరించి నీలమేఘ శ్యాముడికి పూజలు నిర్వహించారు. దశరథ తనయుడి చిత్రపటాలతో ఊరూవాడా శోభాయాత్రలు వైభవంగా జరిపారు. జై శ్రీరామ్ అంటూ నినదించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని సామూహికంగా వీక్షించారు. ప్రముఖ ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా జరిపారు. పలుచోట్ల రథోత్సవాలు కనుల పండువగా సాగాయి. ఆలయాల్లో భజనలతో శ్రీరామున్ని భక్తులు కీర్తించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు సైతం పాల్గొన్నారు.

–సాక్షినెట్‌వర్క్



నంద్యాల: సంజీవనగర్ రామాలయంలో ముత్యాలతో అలంకారం



నందికొట్కూరు: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కర్నూలు: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అయోధ్య నమూనా ఆలయం



కర్నూలు: నమూనా ఆలయంలో ఉత్సవ విగ్రహాలు



కర్నూలు: భక్తజన సందోహం మధ్య సాగుతున్న శోభాయాత్ర



కర్నూలు: రాంబొట్ల ఆలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అయోధ్య ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఆళ్లగడ్డ: అహోబిలంలో సీతారాముల కల్యాణ ఉత్సవ విగ్రహాలు



వెల్దుర్తి: పుల్లగుమ్మిలో రామభజన చేస్తున్న భక్తులు



దేవనకొండ: సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు



నందికొట్కూరు: మల్యాలలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



నంద్యాల: కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో నృత్య ప్రదర్శన

సీఎం జగన్‌తోనే వాల్మీకులకు న్యాయం

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే వాల్మీకులకు న్యాయం జరుగుతుందని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. కర్నూలు నగరంలోని వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి యువసేన ఆధ్వర్యంలో మూడో రోజు జరుగుతున్న దీక్షలకు బీవై రామయ్య మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు వాల్మీలకు ఎస్టీ రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారన్నారు. ఆ తీర్మానాన్ని ఆమోదించాలని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు ఒత్తిడి తెచ్చినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకు కృషి చేస్తారన్నారు. వాల్మీకులను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, మునిసిపల్ చైర్మన్‌లు, జెడ్పీ చైర్మన్‌లు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. కర్నూలులో వాల్మీకి భవన్ కోసం 40 సెంట్ల స్థలం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే రూ.10 కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. ధర్నా చౌక్‌ను వాల్మీకి సర్కిల్‌గా నామకరణం చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. నాయకులు వినోద్‌కుమార్, శేషా శ్రీనివాసులు, రామాంజనేయులు, సాయిప్రసాదు, భాస్కర్ నాయుడు, బోయప్రశాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

ప్రాణం తీసిన అతివేగం



మృతిచెందిన ఇబ్రహీం

కోడుమూరు రూరల్ : అతివేగం ఒక యువకుడి ప్రాణం తీసింది. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం ప్యాలకుర్తి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కోడుమూరుకు చెందిన ఇబ్రహీం (28), బడేసా అనే యువకులు వ్యక్తిగత పనిమీద బైక్‌పై కర్నూలు వెళ్లి కోడుమూరుకు వస్తున్నారు. ప్యాలకుర్తి వద్ద బైక్ అతివేగంగా వెళ్తూ అదుపు తప్పి కింద పడడంతో ఇబ్రహీం అనే యువకుడు తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బడేసా అనే యువకుడికి కాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడిన బడేసాను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోడుమూరు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఇబ్రహీం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లు

- ఏసీబీ అధికారుల దాడులతో వెలుగులోకి
- ఎంవీఐ వద్ద రూ.2,02,890 అనధికారిక నగదు స్వాధీనం
- ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వసూళ్ల దందా
- టోల్ ఫ్రీ నెంబర్ 14400కు సమాచారంతో తనిఖీ



ఆర్‌టీఏ చెక్‌పోస్టులో ఏసీబీ తనిఖీల్లో పట్టుబడిన ఎంవీఐ సునీల్ కుమార్

కర్నూలు: పంచలింగాల వద్ద ఉన్న అంతర్‌రాష్ట్ర ఆర్‌టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తేల్చారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సీఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, వంశీనాథ్, ఎస్‌ఐ సుబ్బరాయుడు, హెడ్ కానిస్టేబుల్ దొరబాబుతో పాటు మరో 15 మంది సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉండి సోమవారం సాయంత్రం వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. విధులు నిర్వహిస్తున్న మోటర్ వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) జె.సునీల్‌కుమార్ వద్ద అనధికారికంగా ఉన్న రూ.2,02,890 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని వాహనదారుల నుంచి అక్రమంగా వసూలు చేసినట్లు గుర్తించారు. సునీల్ కుమార్‌ను పలు విధాలుగా ప్రశ్నించి సమాధానం రాబట్టారు. సమీప గ్రామాలకు చెందిన ఐదుగురు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రైవేటు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుని ఎంత కాలంగా పనిచేస్తున్నారు? పని చేసినందుకు రోజుకు ఎంత జీతం చెల్లిస్తున్నారు? తదితర విషయాలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ 14400కు ఒక బాధితుడు చెక్‌పోస్టులో జరుగుతున్న అక్రమ వసూళ్లపై గత నెలలో ఫిర్యాదు చేశాడు. అలాగే వాహనదారుల నుంచి కూడా ఫిర్యాదులు అందడంతో ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి అనుమతితో సోదాలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.

నగదు రహిత విధానం అమలులో ఉన్నప్పటికీ వసూళ్లు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై నుంచి ఈ చెక్‌పోస్టులో నగదు రహిత విధానాన్ని అమలులోకి తెచ్చింది. చెక్‌పోస్టులో చెల్లించాల్సిన బార్డర్ ట్యాక్స్, టెంపర్వరీ పర్మిట్ ఫీజు, వలంటరీ ట్యాక్స్, అపరాధ రుసుం తదితర రకాల చెల్లింపులు పూర్తిగా నగదు రహిత విధానంలోనే చెల్లించాల్సి ఉంది. అయితే ఆ విధానానికి స్వస్తి చెప్పి అధికారులు నగదు రూపంలో వసూలు చేస్తుండటంతో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు 14400కు జిల్లా నుంచి తరచూ ఫిర్యాదులు వెళ్తున్నాయని డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

ఐదేళ్లలో మూడవసారి...

ప్రభుత్వం ఎంతగా నియంత్రిస్తున్నప్పటికీ రవాణా శాఖలో వసూళ్ల పర్వం ఆగడం లేదు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై తిరిగే వాహనాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే సొంత జేబులు నింపుకుంటున్నట్లు ఏసీబీ తనిఖీల్లో బయటపడింది. గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న ఒక లారీ నుంచి రూ.500 మామూళ్లు తీసుకుని వదిలేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. దాని సామర్థ్యం 35 టన్నులకు గాను 61 టన్నుల లోడ్‌తో వెళ్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. 26 టన్నులు ఎక్కువగా ఉన్నప్పటికీ కేవలం రూ.500 మామూలు తీసుకుని వదిలేసినట్లు అధికారులు గుర్తించారు. అధిక లోడ్‌కు ప్రభుత్వానికి రూ.78 వేలు ఆదాయం వస్తున్నప్పటికీ కేవలం రూ.500 తీసుకుని వదిలేసినట్లు అధికారులు గుర్తించారు. చెక్‌పోస్టులో జరుగుతున్న అక్రమ వసూళ్లపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ చెక్‌పోస్టుపై గత ఐదేళ్ల కాలంలో మూడుసార్లు ఏసీబీ తనిఖీలు జరిగాయి. ప్రైవేటు వ్యక్తులతో పాటు ఎంవీఐ డ్రైవర్, హోంగార్డు కూడా వసూళ్ల దందాకు సహకరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించి నివేదిక రూపొందించారు. విద్యాశాఖకు చెందిన ఇద్దరు అధికారులతో పాటు డీటీసీ శ్రీధర్‌ను కూడా అక్కడికి పిలిపించి వారి సమక్షంలో (మధ్యవర్తులు) పంచనామా నిర్వహించారు.

'సెబ్'లో భారీగా బదిలీలు

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో భారీగా బదిలీలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు సీఐ, ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. జిల్లాలో 14 సెబ్ స్టేషన్లు, 6 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆయా స్టేషన్లు, చెక్‌పోస్టులలో మూడేళ్లుగా పనిచేస్తున్న వారితో పాటు సొంత జిల్లాకు చెందిన వారిని కూడా సీమ జోన్(ఫోర్త్) పరిధిలోని మరో జిల్లాకు బదిలీ చేశారు. సీమ జోన్ పరిధిలోని జాయింట్ డైరెక్టర్లు, సెబ్ డిప్యూటీ కమిషనర్(ఏటీపీ)తో కలసి కసరత్తు చేసిన జాబితాను కమిషనర్‌కు పంపగా ఆమోదించిన జాబితాను ఆదివారం విడుదల చేశారు.

ఏఆర్ విభాగంలో ..

పోలీసు శాఖ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగంలో ఆర్‌ఎస్‌ఐలకు భారీగా స్థానచలనం కలిగింది. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీమ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మొత్తం 49 మంది ఆర్‌ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఆర్‌ఎస్‌ఐలు మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు.

పేరు	పనిచేసిన స్థానం	బదిలీ స్థానం
రాజేంద్రప్రసాద్	స్టేట్ హెడ్ క్వార్టర్	సెబ్ స్టేషన్, కర్నూలు
రామాంజనేయులు	సెబ్ స్టేషన్, పులివెందుల	సెబ్ స్టేషన్, కోడుమూరు
భార్గవ రెడ్డి	సెబ్ స్టేషన్, మడకశిర	సెబ్ స్టేషన్, ఎమ్మిగనూరు
విన్నీ లత	సెబ్ స్టేషన్, ఎల్‌ఆర్.పల్లి	సెబ్ స్టేషన్, ఆదోని
సువర్ణ లత	కొడికొండ చెక్ పోస్ట్	సెబ్ స్టేషన్, పత్తికొండ
మహబూబ్ బాషా	క్యాటిల్‌ఫామ్ చెక్ పోస్ట్	సెబ్ స్టేషన్, కోసిగి
సోమశేఖర్	స్టేట్ హెడ్ క్వాటర్	సెబ్ స్టేషన్, ఆలూరు
నరసా నాయుడు	ఇంటెలిజెన్స్ వింగ్ (ఏటీపీ)	డీటీఎఫ్, కర్నూలు
ఎస్.ఎం.రఫీ	నరహరిపేట చెక్‌పోస్ట్	ఇంటెలిజెన్స్‌వింగ్, కర్నూలు
తిరుమలయ్య	సెబ్ స్టేషన్, తిరుమల	పంచలింగాల చెక్‌పోస్ట్
విశ్వేశ్వర రావు	సెబ్ స్టేషన్, నాగలాపురం	పెద్దహరివాణం చెక్‌పోస్ట్
మల్లిక	సెబ్ స్టేషన్, మొలకలచెరువు	సుంకేసుల చెక్‌పోస్ట్
శ్రీధర్	డీటీఎఫ్, పుట్టపర్తి	హొళగుంద చెక్‌పోస్ట్
చెన్నారెడ్డి	సెబ్ స్టేషన్, ముద్దనూరు	బాపురం చెక్‌పోస్ట్
చంద్రశేఖర్	సెబ్ స్టేషన్, చిత్తూరు రూరల్	ఛత్రగుడి చెక్‌పోస్ట్
వై.జోగేంద్ర	సెబ్ స్టేషన్, చిత్తూరు	సెబ్ స్టేషన్, బనగానపల్లె
విజయ కుమార్	సెబ్ స్టేషన్, తిరుపతి	డీటీఎఫ్, నంద్యాల
విశ్వనాథ్ రెడ్డి	సెబ్ స్టేషన్, కడప	సెబ్ స్టేషన్, నంద్యాల
వర్ధనా దేవి	సెబ్ స్టేషన్, నగిరి	సెబ్ స్టేషన్, కోవెలకుంట్ల
మారుతి రావు		సెబ్ స్టేషన్, ఆత్మకూరు
జయనాథ రెడ్డి	సెబ్ స్టేషన్, తనకల్లు	సెబ్ స్టేషన్, డోన్
సీతారామి రెడ్డి	సెబ్ స్టేషన్, పుంగనూరు	సెబ్ స్టేషన్, నందికొట్కూరు